క్లుప్తంగా

జానపద గాయని సోమిశెట్టి సరళకు ఉగాది పురస్కారం



ఉగాది పురస్కారం అందుకున్న జానపద కళాకారిణి సోమిశెట్టి సరళ

ధర్మవరం అర్బన్: పట్టణానికి చెందిన జానపద గాయకురాలు సోమిశెట్టి సరళ ఉగాది పురస్కారం అందుకుంది. తిరుపతి సిటీ ఛాంబర్ 28వ వార్షికోత్సవం సందర్భంగా 2025 సంవత్సరానికి ఉగాది పురస్కారాన్ని కళారంగంలో రాణిస్తున్న వారికి అందించారు. ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో జానపద గాయకురాలు సోమిశెట్టి సరళకు తిరుపతి శాసనసభ్యుడు శ్రీనివాసులు, సిటీ ఛాంబర్ చైర్మన్ ఆయుబ్‌ఖాన్, మాజీ శాసనసభ్యులు మోహన్, సుగుణ, తిరుపతి కార్పొరేటర్ అనిత ఉగాది పురస్కారాన్ని అందించారు. తనకు ఉగాది పురస్కారం రావడం చాలా సంతోషంగా ఉందని గాయకురాలు సరళ సంతోషం వ్యక్తం చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని పోస్టు కార్డు ఉద్యమం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

కదిరి టౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ మే 5 నుంచి పోస్టు కార్డు ఉద్యమం చేపడుతున్నట్లు వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి పోస్టు కార్డుల ద్వారా తెలియజేస్తామన్నారు. అలాగే మహర్షి వాల్మీకి బోయ సంఘం నిర్వహించే పాదయాత్రకు వాల్మీకులంతా మద్దతు పలకాలని కోరారు. నాయకులు ఆనంద్, శివప్రసాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాలాచార్యులు అధ్యక్షతన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 93 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 72 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపికయ్యారు. క్యాంపు దాత గూడూరు నాగయ్య కుటుంబ సభ్యులు సేవలందించారు. అనంతరం లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు గూడూరు మోహన్‌దాస్, రాజగోపాల్, మెటికల కుళ్లాయప్పను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ శిబిరంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఆకులేటి రమేష్‌బాబు, కోశాధికారి ఉలవల నాగేంద్ర, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గోసే రాధాకృష్ణ, జి.రాధాకృష్ణ, చందా నాగరాజు, పల్లెం వేణుగోపాల్, ఆప్తమాలజి అసిస్టెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

కదిరి: మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్యానల్ చైర్‌పర్సన్ పి.హరిణి ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. 2024–25వ ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు, 2025–26కు సంబంధించి బడ్జెట్ అంచనాలపై ఉదయం 11 గంటలకు ప్రత్యేక కౌన్సిల్ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతో పాటు అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రైతులకు పశువుల దాణా పంపిణీ



రైతులకు దాణా పంపిణీ చేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: కదిరి డివిజన్ పరిధిలోని కదిరి, నల్లచెరువు, తలుపుల, నల్లమాడ మండలాలకు రైతులకు ఆతియా ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం పశువుల దాణా పంపిణీ చేశారు. ఈసందర్భంగా కంపెనీ సీఈఓ వెంకటేష్‌నాయక్ మాట్లాడుతూ కంపెనీలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకూ ఒక్కో పాకెట్‌పై రూ.180 సబ్సిడీతో దాణా అందిస్తున్నామన్నారు. స్ప్రేయర్లు, ఇతర వ్యవసాయ పరికరాలను సబ్సిడీతో అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఓలు బాలక్రిష్ణారెడ్డి, శ్రీనివాసులు, మల్లిని, శిరీష తదితరులు పాల్గొన్నారు.



నల్లసింగయ్యగారిపల్లి వద్ద షెడ్డులో మేపుతున్న కోళ్లు



పుల్లగూరపల్లి వద్ద దాదాపు రూ.కోటితో నిర్మించిన అతిపెద్ద పౌల్ట్రీ ఫాం

స్వయం ఉపాధి వైపు.. యువత చూపు

- విస్తరిస్తున్న పౌల్ట్రీ, పాడి పరిశ్రమలు
- అందని ప్రభుత్వ సాయం

నల్లమాడ: ఉద్యోగ అవకాశాలు కష్టతరమైన నేటి పరిస్థితుల్లో స్వయం ఉపాధిపై నిరుద్యోగ యువత మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, పాడి పరిశ్రమలు విస్తరిస్తున్నాయి. నల్లమాడ మండలంనల్లసింగయ్యగారిపల్లి, పుల్లగూరపల్లి, బాసంవారిపల్లి, తోలేటివారిపల్లి గ్రామాల వద్ద ఇటీవల కాలంలో పౌల్ట్రీ (కోళ్ల ఫారం) షెడ్లు పెద్ద సంఖ్యలో వెలిశాయి. అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గంలోని ఓడీ చెరువు, అమడగూరు, బుక్కపట్నం, పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లో కూడా బ్రాయిలర్, నాటు కోళ్లు, పొట్టేళ్ల పెంపకంతో పాటు పారిశ్రామ తదితర స్వయం ఉపాధి రంగాలు వెలుస్తున్నట్లు సమాచారం.

భూమి కౌలుకు తీసుకొని

ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగ యువకులు సొంత భూమి లేనిపక్షంలో ఇతర రైతులకు చెందిన సాగునీటి వసతి ఉన్న భూములను నాలుగైదేళ్ల పాటు కౌలుకు తీసుకొని అందులో షెడ్లు నిర్మించి కోళ్లు, పాడి పశువుల పెంపకం చేపడుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాల్లో ప్రైవేట్, కాంట్రాక్ట్ ఉద్యోగం చేస్తే వచ్చే నెల వేతనం ఖర్చులకే సరిపోతోంది తప్ప మిగులుబాటు ఏమీ ఉండదని, అదే స్వగ్రామాల్లో ఎటువంటి మానసిక ఒత్తిడి లేకుండా నెలకు రూ.20 వేలు, రూ.30 వేలు సంపాదించినా ఎంతో తృప్తిగా ఉంటుందని వారంటున్నారు. దీంతో రూ.లక్షల ఖర్చుచేసి షెడ్లు నిర్మించుకొని పలు కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని కోళ్ల, పందుల పెంపకం చేపడుతున్నారు. ఫలితంగా నెలకు రూ.ఒక లక్ష నుంచి రూ.3 లక్షలు పైబడి రాబడి పొందుతున్నారు.

ప్రభుత్వం నుంచి సహకారం లేదు..

చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కోళ్ల, పాడి పశువుల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించకపోవడం గమనార్హం. తమ శక్తిమేరకు సొంత పెట్టుబడితో కోళ్ల పెంపకం చేపట్టామని, ప్రభుత్వం, బ్యాంకులు సహకారం అందిస్తే స్వయం ఉపాధిని మరింత విస్తృతం చేసి తమతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తామని నిర్వాహకులు అంటున్నారు.

కోళ్ల ఫారంతో ఉపాధి



నేను, నా తమ్ముడు ఇద్దరము డిగ్రీ వరకు చదువుకున్నాం. మా సొంత భూమిలోనే దాదాపు రూ.కోటితో ఏసీ సౌకర్యం కలిగిన కోళ్ల ఫారం, పశువుల షెడ్లు, ఇల్లు నిర్మించుకున్నాం. ఐబీ కంపెనీ వారు కోడిపిల్లలు, దాణా, మందులు సరఫరా చేస్తారు. వాటిని 40 రోజుల పాటు పెంచి పెద్ద చేయాలి. తరువాత కంపెనీ వారే వచ్చి కోళ్లు తూకాలు వేసి తీసుకెళ్తారు. కోడి తూకం, మార్కెట్ ధరను బట్టి మాకు ఒక కిలోకు రూ.7 నుంచి రూ.10 వరకు కమీషన్ అందజేస్తారు. ఒక లాటుకు 16 వేలు కోడి పిల్లలను మేపుతాం. రూ.3 లక్షల వరకు కమిషన్ అందుతుంది.

– చింతా సురేంద్రరెడ్డి, పుల్లగూరపల్లి, నల్లమాడ మండలం

ప్రభుత్వం సాయం అందించాలి



వ్యవసాయం వల్ల పెద్దగా లాభం లేకపోవడంతో మా బంధువుల సూచనతో రెండేళ్ల క్రితం రూ.15 లక్షలకుపైగా ఖర్చుచేసి రెండు షెడ్లు నిర్మించి కోళ్ల పెంపకం చేపట్టాను. ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు. ప్రభుత్వం స్పందించి బ్యాంకు రుణం అందజేస్తే కోళ్ల పెంపకాన్ని మరింత వృద్ధి చేసి మరికొందరికి ఉపాధి కల్పించాలనే ఆలోచన ఉంది. ప్రభుత్వం పౌల్ట్రీ అభివృద్ధికి సహకరించాలి.

–బడా మాధవరెడ్డి, పౌల్ట్రీ నిర్వాహకుడు, నల్లసింగయ్యగారిపల్లి, నల్లమాడ మండలం

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలి

ఓడీచెరువు: పేదలకు ఎంతో సేవ చేస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్) రిజిస్ట్రేషన్‌ను రెన్యూవల్ చేయాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఫెడరేషన్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు ఎంఎస్ షబ్బీర్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు ఎనలేని సేవలు అందిస్తున్న ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకపోవడంతో విద్య, వైద్య సేవలకు అంతరాయం కలుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు, కూటమి నేతలు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేయించాలని కోరారు. నాయకులు కృష్ణమూర్తి, సురేష్, లక్ష్మీదేవి, బాషా, జైరాంనాయుడు తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కదిరి టౌన్: సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల హామీలను నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా రెండు నెలల పాటు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈనెల 24 నుంచి 26 వరకు జిల్లా వ్యాప్తంగా నిరహార దీక్షలు చేశామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు పట్టణంలో రెండు సెంట్లు,గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు ఇవ్వాలని, ఆగిపోయిన టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు. ఎన్నికల హామీలు నెరవేర్చాలని కోరుతూ మే 5న కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు శ్రీనివాసులు, జీఎల్.నరసింహులు, జగన్‌మోహన్, సాంబ, రామ్మోహన్, బాబ్జాన్, శాంతిబాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్



ధర్మవరంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న టూటౌన్ సీఐ రెడ్డెప్ప

బత్తలపల్లి: ఇక నుంచి గొడవలకు వెళ్లకుండా సత్ప్రవర్తనతో మెలగాలని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ రౌడీషీటర్లను హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీ షీటర్లతో పాటు అనుమానితులకు డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. అనవసరంగా ఘర్షణలకు వెళ్లడం, గొడవల్లో తలదూర్చడం చేస్తే చర్యలు తప్పవన్నారు. అందరితో కలిసి మెలిసి ఉండాలని అప్పుడే మంచి గౌరవం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్, ఆర్పీఎస్‌ఐ గోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: రౌడీషీటర్లు గొడవలు, అల్లర్లకు పాల్పడినా సృష్టించాలని చూసినా కఠిన చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ రెడ్డెప్ప హెచ్చరించారు. పట్టణంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో జీవించాలన్నారు. ఎవరైనా గొడవలకు వెళ్లినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలకు దూరంగా కుటుంబంతో సంతోషమైన జీవితాన్ని గడపాలని సూచించారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

పుట్టపర్తి: కొత్తచెరువు గ్రంథాలయంలో మంగళవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి జయరామ్ ఆదివారం తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఈనెల 29 నుంచి జూన్ 6వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జయరాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ముద్రించిన కథలు చెప్పడం, చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే గ్రంథాలయానికి రావాలని సూచించారు.

రేపటిలోపు దేశం విడిచిపోండి

బత్తలపల్లి: పాకిస్థాన్ దేశస్తులు ఎవరైనా మండలంలో ఉంటే వారు మంగళవారం లోపు దేశం విడిచి వెళ్లిపోవాలని, లేని పక్షంలో భారతదేశం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని బత్తలపల్లి తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. మండలంలో ఎవరైనా పాకిస్థాన్‌కు చెందిన సాధారణ వీసా, మెడికల్ వీసాదారులు ఉంటే వెంటనే దేశం విడిచి వెళ్లాలని, ఈమేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చాయని పేర్కొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

బత్తలపల్లి: తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు ఆదివారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. మండలస్థాయిలో జరిగే కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేయవచ్చని సూచించారు.

జిల్లా జడ్జికి సన్మానం



జిల్లా జడ్జి భీమరావును సన్మానిస్తున్న ఏజీపీ భాస్కర్ రెడ్డి

పెనుకొండ రూరల్: కోర్టు భవనాల పరిశీలనలో భాగంగా ఆదివారం జిల్లా జడ్జి భీమారావు పెనుకొండకు విచ్చేశారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా జడ్జి భీమారావుకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏజీపీ భాస్కర్ రెడ్డి తదితరులు జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కోర్టు అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్ కుమార్, తహసీల్దార్ శ్రీధర్, లాయర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుడో పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు

గాండ్లపెంట: విశాఖపట్నంలో ఆదివారం జరిగిన రాష్ట్రస్థాయి కుడో(మార్షల్ ఆర్ట్స్) అండర్–14 పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల పీడీ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. పోటీల్లో లోకేశ్వరీ, నాగవర్ధన్, పురుషోత్తం రెడ్డి ప్రతిభచాటి బంగారు పతకాలు సాధించారన్నారు. వీరు వచ్చే నెల14న పుణేలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. మెడల్ సాధించిన విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం సిద్దారెడ్డి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ సభ్యులకు అండగా ఉంటాం



జానకంపల్లిలో ఆంజనేయులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సిద్దరాంపురంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంధ్యను పరామర్శిస్తున్న దుద్దుకుంట

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరికీ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆయన ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. జానకంపల్లిలో ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకున్న ఆంజనేయులు, కాలువ బ్లాస్టింగ్ రాయి తగిలి గాయపడిన బాలుడు తిరుమల సాయి, అనారోగ్యంతో బాధపడుతున్న లక్ష్మీనరసమ్మ, చెన్నప్ప, మల్లికార్జున, నారాయణరెడ్డి, బుచ్చయ్యగారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న పిచ్చల శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రవిప్రసాద్‌రెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీసీ తండాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లాల్‌బాబునాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న శీకాయకుంటపల్లికి చెందిన మాజీ డీలర్ కేశప్ప, రాజును పరామర్శించారు. అగ్రహారంలో మృతి చెందిన పెద్ద చెన్నప్ప, టీ కేశప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వీరభద్రప్ప, నరేష్, కుళ్లాయప్ప, నారాయణ స్వామి, లక్ష్మీదేవి, గోవిందుల ఆరోగ్య స్థితిపై ఆరా తీశారు. సిద్దరాంపురంలో ఇటీవల మృతి చెందిన నరసింహులు, నారప్ప.అనిత, రుక్సాన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఇదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆంజనేయులు కుమార్తె సంధ్యను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, కొత్తకోట కేశప్ప, సిద్దరాంపురం సర్పంచ్ రమణయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు గండ్లూరి ప్రభాకర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, పుటికిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బట్టల కేశప్ప, కేశవరెడ్డి, వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, మండల బూత్ లెవల్ మేనేజర్ పతంజలి, ఎల్‌ఐసీ చంద్ర, నీలూరి ఈశ్వర్, మల్లేష్ శివయ్య, లింగమయ్య పాల్గొన్నారు.

11 నుంచి ఏటి గంగమ్మ సంబరాలు



పోస్టర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తలుపుల : మండల కేంద్రం ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద మే 11 నుంచి మూడు రోజుల పాటు సంబరాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం వారు సంబరాలకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా గంగమ్మ ఆలయం వద్ద సంబరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్ట్

తలుపుల : మండలంలోని లక్కసముద్రం గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందెం స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 5 కోళ్లు, రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవించాలని ఎస్‌ఐ సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. కష్టపడి పని చేసుకుంటూ పిల్లలను చదివించుకోవాలన్నారు. అనవసరంగా గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు



పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు

తాడిమర్రి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ పూజారి నాగలక్ష్మమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు వెండి గొడుగులు తొడిగి, పలు రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలు నెత్తి మీద ఎత్తుకుని ఆలయ ప్రదక్షిణలు చేసి, అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

గడ్డివామికి నిప్పు

సోమందేపల్లి: మండలంలోని పందిపర్తి గ్రామంలో రైతు అశ్వత్థ నారాయణకు చెందిన గడ్డివామికి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పశువుల మేత కోసం ఇంటి వద్ద గడ్డిని నిల్వ చేసినట్లు రైతు అశ్వత్థ నారాయణ తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఘటనపై పోలీసులకు రైతు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

యవకుడికి తీవ్రగాయాలు

గోరంట్ల: మండల పరిధిలోని సామలపల్లి సమీపంలో హిందూపురం–గోరంట్ల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మిషన్ తండాకు చెందిన వసంత నాయక్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వసంత నాయక్ రోడ్డు దాటే క్రమంలో వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని 108లో చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.

పగలే వెన్నెలాయె!



పగలే వెలుగుతున్న వీధిదీపం

కదిరిటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పగలే వీధిదీపాలు వెలుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సైదాపురం సమీపంలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అపార్ట్‌మెంట్‌కి వెళ్లే దారిలో వారం రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా వీధిదీపాలు వెలుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



పుట్టపర్తిలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సునీత

పుట్టపర్తి టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాలతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం లాంటి వాటిపై తనిఖీ చేపట్టామన్నారు. వాహనాదారులు వాహన రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ తప్పనసరిగా ధరించాలన్నారు. ఇక పలు పోలీస్‌స్టేషన్లలో రౌడీషీటర్లు, అనుమానితులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. శక్తి యాప్‌ను మహిళలతో డౌన్‌లోడ్ చేయించి యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించారు.